మురళీకృష్ణ దుర్గుణాల గురించి వారు రకరకాలుగా విని ఉన్నారు. సుప్రసిద్ధి కన్నా కుప్రసిద్ధి త్వరగా వ్యాపిస్తుందనేది జగమెరిగిన సత్యమే.

"చంద్రలేఖా ! కలవారి ఇళ్ళల్లో కుర్రవాళ్ళకి కాస్తో కూస్తో దురలవాట్లు ఉండటం సహజమే. పరిపక్వత రావడంతో అలాంటి ప్రవీణలతలు తగ్గిపోవడం కూడా సహజమే. పందెపు గుర్రం లాంటి పరువంలో ఉన్న కుర్రవాడు వివాహమనే కళ్ళెం పడ్డంతో మర్యాదరామన్న అయిపోతాడు. కొంతమంది కొయ్యగుర్రాలు కూడా కావచ్చు. చిన్నప్పుడు నేను జులాయిగా తిరిగే వాడిని. రౌడీలా ప్రవర్తించేవాడిని. తరువాత గజరౌడీ వయిన నిన్ను పెళ్ళాడాక నేను ఎంత మెత్తబడిపోయానో చూడు ! ఆ రోజు నుంచి నీ నాలుక మీదే నడుస్తున్నాను కదా ! ఆ మాటకొస్తే మనవాడు మాత్రం ఏమైనా తక్కువ తిన్నాడా ? వీడి పెళ్ళి ప్రస్తావన వచ్చినపుడు అమ్మాయి తల్లితండ్రులు కూడా ఇలాంటి అభ్యంతరం చెప్పకుండా ఉంటారా ? మురళి చాలా సమర్థుడు. బాగా సంపాదిస్తున్నాడు. ఈ కాలంలో తాగుడు, సిగరెట్టు లాంటి అలవాట్లు లేని వెజిటేరియన్ అబ్బాయిలు ఎక్కడ దొరుకుతారు ? పెళ్ళి అయ్యాక చూడు మనలేఖ అతన్ని గీసిన గీటు దాటనివ్వదు. అతన్ని సరిగ్గా కంట్రోల్ చేయకుండా నేను వదుల్తానా ? ఆ ఫాదర్ ఇన్ 'లా' చెయ్యలేని పని ఈ ఫాదర్-ఇన్-లా చేయగలడని నిరూపిస్తా. నువ్వు చూస్తూ ఉండు. " అని సీతాపతి చెప్పినపుడు, చంద్రలేఖ ఒక 'క్లారిఫికేషన్' అడగకుండా ఉండలేక పోయింది.

"మీరు చివర్లో చెప్పిన మాట నాకు అర్థం కాలేదు, అది ఏమిటి ?"

" అంటే అతని ఫాదర్ లీగల్ ప్రొఫెషన్‌లో ఉన్నాడు కదా ! అందుకే అలాంటి ఫాదర్‌ని ఇన్ 'లా' అని చెప్పడంలో తప్పు లేదు. వృత్తి రీత్యా నేను ఒక ఔట్ 'లా' కావచ్చు కానీ అల్లుడు గారికి నేను ఇన్-లా- నే కదా ! ఓ బుద్ధి లేఖా ! ఇప్పుడు అర్థమయిందా?"

భార్యా పిల్లల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ఈ సీతాపతి రావు ఇందులేఖా వివాహ నిశ్చయ మహోత్సవాన్ని వైభవంగా జరిపించాడు. ఒక పెళ్ళి జరిగినంత వైభవంగా ఇది జరిగింది. పుర ప్రముఖులందరూ ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. రాజకీయ రంగంలోని భీష్మాచార్యులందరు, చెట్టు కింద, చెట్టు పైన ఉన్న లీడర్లందరు ఈ నిశ్చితార్థానికి హాజరయ్యారు. మరుసటిరోజు అన్ని దిన పత్రికలలో ఈ వేడుక గురించి వేడి వేడి వార్తలు వచ్చాయి. ఇందులేఖ బి.ఏ. ఫైనల్ ఇయర్‌లో ఉండటం వల్ల వివాహ ముహూర్తం నాలుగు నెలల తరువాత ఏప్రిల్ నెలాఖరులో నిర్ణయించబడింది. ఆ ఏకైక కారణం వలన ఇందు, మురళీల వివాహపూర్వ ప్రణయానికి దాదాపు అయిదు నెలల వ్యవధి దొరికింది. ఇందులేఖని కాలేజీలో స్నేహితురాళ్ళు బాగా ఏడిపించసాగారు. ఏమేమి సవాళ్ళు ఎన్నెన్ని సంశయాలు, పెళ్ళీడుకొచ్చిన పిల్లలకి మంచీ మర్యాద కానీ సిగ్గు, శరం కానీ ఉండవని ఇందుకు అనిపించింది.

మొదట్లో మురళి రెండు మూడు రోజులకొకసారి ఇందును సందర్శించేవాడు. క్రమేణా అది నిత్య సందర్శనంగా పరిణమించింది. వారిద్దరు కలిసి గడుపుతున్న వేళల నిడివి కూడా పెరుగుతూ వచ్చింది. ఇందు గానలహరిలో మురళి తన్మయుడై పోతుండేవాడు. గానం అంటే ఆమెకూ ప్రాణమే. ఆ విధంగా ఆ యువ మిధునం మరింత దగ్గర అయింది. అపుడపుడు షికారు కని చెప్పి వాళ్ళు బయటకు వెళ్ళేవారు.

నిశ్చితార్థం జరిగిన రెండున్నర నెలల తరువాత ఆ కుటుంబం పైన ఒక పెద్ద పిడుగు పడింది. చాలా కాలంగా మంత్రి వర్గంలో రకరకాల పెనుగులాటలు నడుస్తుండేవి. ముఖ్యమంత్రిగారికి తన కుర్చీ ఎగిరి పోతుందేమోననే భయం రోజురోజుకు పెరుగుతూ వచ్చింది. సీతాపతి రావు రాజకీయబలం పుంజుకోవడం తనకు ముప్పుగా పరిణమించవచ్చని ముఖ్యమంత్రి భయం. అయినా కూడా సీతాపతి రావుతో ఒక ప్రత్యక్ష యుద్ధానికి దిగడానికి అతను ఇష్టపడలేదు. చివరికి

ఒక నిర్ణాయక ఘట్టంలో ముఖ్యమంత్రి గారికి ఒక తరుణోపాయం ఆలోచించక తప్పలేదు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలనే సాకుతో సీతాపతిరావు పార్టీనుండి బహిష్కరించబడ్డాడు. దీనితో పాటు శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేయవలసి రావడంతో కుక్కకాటు, చెప్పుదెబ్బ రెండూ అతనికే తగిలినట్టయ్యింది. అతనికి ఎంతో దగ్గరగా మసలిన ఎంతోమంది అతనిని ఒంటరిగా వదిలేసి ముఖ్యమంత్రి వర్గంలో చేరిపోయారు. వాళ్ళల్లో ఇలా జరగబోతుందని పసిగట్టి ముందుగానే మారిపోయినవారు కూడా ఉన్నారు. బహిష్కరణ సంఘటన తరువాత అతని మిగతా అనుయాయులు కూడా గొర్రెలమందలా కంచె అవతలికి దూకేశారు.

రెక్కలు విరిగిప పక్షిలా అతను గూడు విడిచి బయట ప్రపంచంలోకి అడుగు పెట్టడం మానేశాడు. కొంతకాలం తరువాత అతను తిరిగి అధికారంలోకి వస్తాడన్న మాట బయటనే కాకుండా, కనీసం ఇంట్లో కూడా వినిపించలేదు. అతనికి ఏలినాటి శని ప్రభావం వల్లే ఈ దురంతం జరిగిందని, ఇంకా కొంత కాలం వరకూ మంచిరోజులు తిరిగి రావని కొంతమంది జ్యోతిష్కరత్నాలు ప్రవచించడం జరిగింది. స్థానభ్రంశం, మానహాని ఈ కష్టకాలానికి ప్రారంభం మాత్రమేనని' ముందున్నది ముసళ్ళపండగ' అని వాళ్ళలో కొందరు సూచనలివ్వడం కూడా జరిగింది.

మునుపటి రోజుల్లో తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ ఆ ఇంట్లో పరిసరాలలో జనం కిటకిటలాడుతుండేవారు. కానీ ఇప్పుడో ? ఆ బంగళా దరిదాపులకి రావడానికి కూడా జనం తటపటాయిస్తున్నారు. అక్కడికి రావాలనుకున్నవాళ్ళను కూడా మిగతావాళ్ళు రానివ్వరేమో ! మనుష్యులు నిర్దయులుగా, హృదయరహితులుగా, ఎలా మారిపోయారని ఆ కుటుంబ

సభ్యులంతా అబ్బురపడ్డారు.

ఈ స్థానభ్రంశానికి రెండురోజుల ముందు, తాండవకృష్ణతన స్నేహితుడి ఇంటికి వెళ్ళి రాబోయే పరిణామాల గూర్చి అతనిని హెచ్చరించడం జరిగింది. తనకేమీ జరగదు, సరికదా ఆ ముఖ్యమంత్రికే ఏదో జరగబోతోందని సీతాపతి అనుకున్నాడు. ఆ పిడుగు పడిన రోజు వకీలు తన మిత్రుడి ఇంటికి వెళ్ళి ఊరడింపు మాటలు చెప్పి, త్వరలో పరిస్థితులు చక్కబడతాయనే ఆశాభావాన్ని వెల్లడించాడు. ఆ తరువాత అతను ఆ ఇంటి ఛాయలకే పోలేదు. ఇంచుమించు అలాగే అతని సుపుత్రుడు కూడా చేశాడు. వీరిద్దరికీ ఒక చిన్న విషయంలో తేడా ఉంది. తండ్రి రెండురోజులు వరుసగా వెళ్ళి తరువాత మానేస్తే కొడుకు అలాంటి రెండు సందర్శనాల తరువాత ఆ ఇంటి చిరునామాయే మరిచిపోయాడు. అంతేకాదు ఇందులేఖ టెలిఫోన్ నెంబరు కూడా అతని జ్ఞాపకాల నుండి అంతర్ధానమై పోయింది. ఎన్నోసార్లు ఆమె అతనితో టెలిఫోన్‌లో మాట్లాడాలని ప్రయత్నం చేసింది. కానీ మురళి పక్షం నుంచి వచ్చిన నిరాసక్త ప్రతిస్పందన ఆమెను భయవిహ్వలను చేసింది. నిజానికి ఇందు అంటే చాలా ఇష్టమే. కానీ అతని ప్రేమకు మబ్బు పట్టించింది మరేమీ కాదు. అతని పూజ్య పితాశ్రీ ఉపదేశాలే.

"బాబు ! ఇక ఇందును మరిచిపోవడమే మంచిది." మురళి తన కాళ్ళ దగ్గర ఒక టపాకాయ పేల్చినట్టు అదిరి పడ్డాడు. " అదేం డాడీ ! అలా అంటున్నారు ? నిశ్చితార్థం, ముహూర్త నిర్ణయం కూడా అయిపోయాయి కదా!"

"ఓరి పిచ్చివాడా ! ఆమె చనిపోయిందని అనుకో లేకపోతే ఒక సెరిబ్రల్ హెమరేజ్ వచ్చి ఆమె కోమాలో పడిపోయిందని అనుకో అయినా పెళ్ళాడతావా?"

" కానీ డాడీ ! పెళ్ళి అయిన తరువాతే అలా జరిగాతే ? "

"అయితే ఏమంటావు ? నువ్వు ఆత్మహత్య చేసుకుంటావా ? చూడు బాబూ, మనిషి తన బతుకు తను బతకాలి. ఆ బతుకు ఎంత సుఖంగా సంతోషంగా గడపగలిగితే అంత మంచిది. జీవితంలో కష్టాలు ఎదురు కావచ్చు. అలాంటి సందర్భాలలో దుఃఖించడం కూడా సహజమే. కానీ, బతుకు అక్కడ ఏమీ ఆగదే ? అది ఒక్క క్షణం కూడా ఆగకుండా ప్రవాహంలా ముందుకు సాగిపోతూ ఉంటుంది. ఆ ప్రవాహంలో మనం తేలుతూ వెళ్ళాలి కానీ మునిగిపోకూడదు. చవులూరే ఈ జీవితమనే ద్రాక్షరసాన్ని అణువణువునా ఆస్వాదిస్తూ ముందుకు సాగిపోతుండాలి. ఇందులేఖతో నీ వివాహం ఇంతవరకూ జరుగకుండా ఉండటం ఎంతో మేలైంది. లేకపోతే ఆ కుటుంబానికి ఏర్పడిన అధఃపతనమూ, మానహాని మనకి కూడా జరిగినట్టే. వాళ్ళతో బంధం మనం ఎందుకు తలపెట్టాం ? అతను ఒక పవర్‌ఫుల్ మినిస్టర్ అని, కొద్దికాలంలో అతను చీఫ్ మినిస్టర్ అవుతాడని అనుకునే కదా ! అంతేకానీ చిన్నప్పటినుంచీ మీరిద్దరూ కలిసిమెలిసి పెరగడం కానీ ప్రేమలో పడటం కానీ జరగలేదు కదా! ఇహ ఆ సీతాపతి మళ్ళీ పైకొస్తాడని నమ్మకమే లేదు. హి ఈజ్ ఫినిష్డ్ అండ్ ఫినిష్డ్ వన్స్ ఫర్ ఆల్! అందుకే ఆ బిగ్ జీరో కూతురుని నువ్వు పెళ్ళాడవద్దు".

"కానీ డాడీ ! మేము చాలా దగ్గరయి పోయాము ........"

" ఇంకేం కానీ, కీనీ లేదు. ఎంత దగ్గరికి వచ్చినా ఫిరవాలేదు. ఇంక మెల్లగా దూరమవడానికి ప్రయత్నం చేయి. ఇలా జరగడం అమ్మాయికి కొంచెం కష్టమే. నేను ఒప్పుకుంటాను. కానీ ఆ కష్టం మనవల్ల కలిగింది కాదు కదా! అమెకు మరో సంబంధం రావడం ఒక పెద్ద సమస్యే. అందుకు బాధ్యుడు ఆమె తండ్రే కదా ! ముఖ్యమంత్రి గారి కుర్చీ కోసం ముఖ్యమంత్రినే తోసి పడేయాలని చూస్తే ఆ ముఖ్యమంత్రే కదా ఇతన్ని నేలమట్టం చేశాడు. ఆ

నష్టం, మానహాని సీతాపతి ఒక్కడే భరిస్తే సరిపోతుందా? వాటి దుష్పరిణామాలు అతని కుటుంబ సభ్యులను, అనుచరులను కూడా బాధిస్తాయి. ఆ విధంగా అతని రాజకీయ దురాశా పరిణామాలలో ఇందులేఖ ఒక్కర్తి. అమె నీకు అంత దగ్గరయి పోయిందన్నావు కదా ! అది ఆమె తప్పు. మీ నిశ్చితార్థం తరువాత, వివాహం జరిగేవరకూ, తన శీలం కాపాడుకోవాల్సిన బాధ్యత ఆమెదే.......

" తప్పు చేసింది పాపం ఇందూ కాదు డాడీ. అనౌచిత్యం జరగకుండా ఆమె శాయశక్తులా ప్రయత్నించింది. ప్రాధేయపడింది, ఏడ్చింది, కోప్పడింది కూడా. అందుకే ఈ విషయంలో నిజమైన అపరాధిని నేనే."

" ఒరేయ్ మూర్ఖుడా ! ముల్లు పోయి ఆకు మీద పడ్డా, ఆకు వచ్చి ముల్లు మీద పడ్డా, కీడు మాత్రం ఆకుకే అని యవ్వన దశలో ఉన్న ఏ ఆకైనా తెలుసుకోవలసిందే ! నీ వయస్సులో ఉన్న యువకులు తప్పు చేయకపోతేనే ఆశ్చర్యం. ఒక అమ్మాయి, అందునా మంచి కుటుంబంలో పుట్టిన అమ్మాయి అంత ఒళ్ళు మరచి ప్రవర్తించవచ్చా ? దుష్యంతుడంత మహా చక్రవర్తి కూడా తన అవసరం తీరగానే శకుంతలని మర్చిపోలేదా ? అమ్మాయిలను వశపరచుకోవడానికి యువకులు ఎన్నెన్నో ఉపాయాలు ప్రయోగిస్తారు. అలాంటి ప్రయత్నాల నుంచి తప్పించుకోవడానికి కావలసిన ధైర్యం, చాకచక్యమూ ప్రతీ ఆడపిల్లకీ ఉండి తీరాలి. లేకపోతే దాని దుష్ఫలితాలు ఆమె అనుభవించక తప్పదు. అందుకే ఆమె ఖర్మానికి ఆమెను వదిలేసెయ్యి. నేనొక ఫస్ట్‌క్లాస్ అమ్మాయిని నీకు కుదిర్చి పెడతాను. వివాహం ఎప్పుడూ కూడా నష్టదాయకం కాకూడదు. "

" కానీ డాడీ, నేను ఈ గిల్టీ ఫీలింగ్‌తో...;........"

" ఒరే పిచ్చి నాయనా, ఈ గిల్టీ ఫీలింగ్ అనేది బలహీనులకి మాత్రమే

మేము ధైర్యంగా చెప్పొచ్చు ."

మనస్థైర్యం, సమచిత్తతలతో కొంచెం కోలుకొని ఆమె ఏడుపు ఆపింది. " నేనెంత భయపడిపోయానో మీకు తెలుసా ? నాన్నగారి కష్టకాలం ప్రారంభం అవడంతో మీరు కూడా నన్ను ఉపేక్షించారేమోననే భయంతో నేను క్షణక్షణం కృశించిపోయాను."

"ఓహ్, నో నో నో, నన్నలా అపార్థం చేసుకోవడానికి నీకు మనసెలా ఒప్పింది. మనమేనాడో భార్యాభర్తలమై పోయాము. ఇక మనల్ని విడదీయడం ఆ బ్రహ్మతరం కూడా కాదు, మన బంధం ఫెవికాల్ బంధమే కదా ?" అని చాలా నాటకీయంగా అతను చెప్పగలిగాడు. అలా అంటూనే అమెను వివస్త్రను చేసే కార్యక్రమం అతను మొదలు పెట్టాడు.

" వద్దు మురళీ వద్దు, నేను వేదనతో చాలా కుంగిపోయి ఉన్నాను. అంతే కాదు దిసీజ్ నాట్ ది టైమ్" అని ఆమె అతన్ని ఆపడానికి ప్రయత్నం చేసింది.

" ఎనీ టైమ్ ఈజ్ కాఫీ టైమ్" అని చెపుతూ ఆ కామాసక్తుడు తన కార్యక్రమాన్ని కొనసాగించాడు....."నీ అలసట వేదన నేనిప్పుడే దూరం చేస్తాను."

" పని వాడు  కాఫీ తీసుకుని ఇపుడు వచ్చేస్తే ? అని అడుగుతూ ఆమె అతనిని ఆపే ప్రయత్నం ఇంకా గట్టిగా చేసింది.

" ఎనిమిది తరువాతే అతను కాఫీ తీసుకువస్తాడు."

" నేను వచ్చినపుడు బయటి తలుపు అతనే తెరిచాడు. అందుకే మనిద్దరికీ అతను కాఫీ తీసుకు రావచ్చు. "

" లోపలనుంచి తలుపు వేసేసి ఉంది కదా. అతను వచ్చి తలుపు తట్టి బయటే నిలబడతాడు."

" అలా అయితే కాఫీ చల్లారి పోతుంది కదా ?"

" ఏం ఫరవాలేదు. ఆ వేడి తగ్గితే ఏమిటి ? ఈ వేడి తగ్గకుండా చూడు... కానీ నువ్వెంత ప్రయత్నించినా ఈ వేడి తగ్గడం సాధ్యం కాదు. "

అతను ఆమెను బలవంతంగా శయ్యపై పడుకోబెట్టాడు.

ఒక అరగంట తర్వాత ఆమె ఇంటి బయటకు నడిచేటపుడు ఆమెలో ఒక కొత్త ఉన్మేషం, ధైర్యం పొడచూపాయి. రతిక్రీడ మధ్యలో అతను అబార్షన్ గురించి ప్రస్తావించేటపుడు అది తనకు స్వీకార్యం కాదని చెప్తే, ఆ విషయమై అతను పట్టుపట్టలేదు కదా అని ఆలోచించేటపుడు ఆమె గుండెధైర్యం పెరిగింది. ఆమెను కారులో కూర్చోపెట్టి "ఇందూ నువ్వు ధైర్యంగా వెళ్ళు, సాయంత్రం నేను ఫోన్ చేస్తాను" అని ఎంతో ప్రేమతో అతను చెప్పడం వల్ల కారు నడుపుతున్న ఇందులేఖకు తన వాహనం చంద్రమండలంలోకి ఎగురుతున్నట్టు అనిపించింది. కుంగిపోయిన హృదయంతో, తన ఆశలన్నీ అడియాసలే అనుకొని తన జీవితం చరమ దశకు వచ్చిందని, భయపడుతూ ఆ ఇంటిలో అడుగుపెట్టిన అమ్మాయి ప్రేమతో కూడిన మురళి ప్రతిస్పందన చూసి బయటికి వచ్చేసరికి, గాలిలో ఎగురుతున్న దూదిపింజ లాగా తేలికగా అయిపోయింది. తను ఎంత మూర్ఖురాలు, ఎంత పిరికిదాన్ని అని ఆలోచించేటపుడు ఆమెకు సిగ్గుగా అనిపించింది. మురళిని అనవసరంగా అపార్థం చేసుకోవడం గురించి ఆమెలో

ఒక అపరాధభావం కలిగింది. తన తండ్రికి వచ్చిన పదవీ భ్రష్టత వల్ల మురళికి తనపట్ల ఉన్న ప్రణయంపై ఒక చిన్న గీటు కూడా పడలేదని తెలుసుకున్నప్పుడు ఆమెకు చాలా ఊరట కలిగింది. ఏమి జరిగినా, ఎవరేమన్నా, మురళి తనను ఎన్నడూ విడనాడడనే ధైర్యం, నిబ్బరం, ఆమె గుండెలోనుంచి కుడి పాదంలోకి పాదం నుంచి ఆక్సిలేటరు మీద ప్రసరిస్తూంటే, అ వాహనవేగం దశదశాల్లోకి పెరగసాగింది.

ఆ నవోన్మేషం ఆమె బ్రేక్‌ఫాస్టుకి, తరువాత మధ్యాహ్న భోజనానికి ఎంతో రుచి కలిగించింది. తేనెలో మునిగి బయట పడిన మిణుగురు పురుగు లాగా ఆ ఉన్మత్తత మెల్లమెల్లగా పాకుతూ ఉండగా ఆ తరుణి...........ఆ రోజు భుజించింది. అది కూడా మృష్టాన్న భోజనం చేసింది కానీ అది ఒక శెలవు రోజైనా కూడా ఆమె మధ్యాహ్నం నిద్ర పోలేదు. మామూలుగా రోజూ అప్పుడప్పుడు మోగుతూ ఉండే టెలిఫోన్ ఆ రోజు చచ్చిపోయినట్టు పడి ఉంది. మధ్యాహ్నం మూడు గంటల తరువాత పదేసి నిమిషాలకొకసారి ఆమె ఫోన్ రిసీవర్ ఎత్తుకొని అది పని చేస్తూనే ఉందని మళ్ళీ మళ్ళీ నిర్ధారించుకుంటోంది. ఐదూ ఐదున్నర అయ్యేటపుడు ఇంకేం చెయ్యాలో పాలుపోని స్థితికి ఆమె వచ్చింది. మురళికి తనే ఫోన్ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా ఆమెకి వచ్చింది. సాయంత్రం ఆయన తప్పకుండా ఫోను చేస్తానన్నారు కదా. ఈ సమయంలో ఆయన ఎక్కడుంటారో? ఎక్కడనుంచయినా ఆయన తప్పకుండా ఫోన్ చేస్తారు. తన ఓర్మిని పరీక్షించడానికే ఇంత ఆలస్యం చేస్తున్నారేమో? .......అలా తలుచుకుంటూంటే....గోప స్త్రీలు తన జాప్యంతో ఏడిపించే ఆనాటి మురళీ కృష్ణుడు ఆమె మనఃఫలకం పై ప్రత్యక్ష మయ్యాడు.

ఈ వేచిఉండటమనేది ఒక మహాబోరైన కార్యక్రమం. కొన్ని ఎదురుచూపులలో కేవలం బోరే కాదు, అసహ్యం, జుగుప్స, ఘృణ, ద్వేషం ఇత్యాది వికారాలు ఇమిడి ఉండొచ్చు. ఉదయం తొమ్మిది గంటలకు కాదు

ఏడు గంటలకే బయలుదేరాలి ఒక మిత్రుడు చెప్తాడు. మంచిదే, గమ్యస్థానం చేరడానికి అయిదు గంటల ప్రయాణం ఉంది కదా. మధ్యాహ్న భోజన సమయానికి అక్కడికి చేరుతాములే. నేను ఐదు గంటలకి లేచి ఒక గంట మార్నింగ్ వాక్ చేసి, స్నానం చేసి, బ్రేక్ ఫాస్టు అయిందని పించి, గబగబా తయారవుతాను. ఏడుంపావు అయ్యేటపుడు ఛీ ఛీ అతనెందుకు రాలేదు అని అని పిస్తుంది. ఏడున్నరకు అతనింటికి ఫోన్ చేస్తే ఆయన ఇప్పుడే అయిదు నిమిషాల కిందటే మీ ఇంటికి బయలుదేరారు అతని శ్రీమతి చెప్తుంది. అతను ఇంటి నుంచి మా ఇంటికి రావడానికి పదిహేను నిమిషాలు చాలు. సూట్‌కేసు తీసుకు వచ్చి వరండాలో పెట్టి, రోడ్డు వైపు చూస్తూ నిలబడడమవుతుంది. తరువాత కార్యక్రమం, ఎనిమిది కొట్టేసరికల్లా ఏం మనిషండీ, అతను చెప్పడం వల్లనే కదా అయిదుగంటలకే లేచి తయారయ్యాను. ఇలాంటి వాళ్ళను కమ్చీతో కొట్టాలి. తరువాత పది నిమిషాలు అటూ ఇటూ పహారా జవాను లాగా పచార్లు చేసిన తరువాత అతని ఇంటికి మళ్ళీ ఫోన్ చేస్తాను. ధర్మ సంకటంలో పడిన అతని దర్మపత్ని, "అయ్యో ఇంకా అక్కడికి చేరుకోలేదా ? దారిలో డీజిల్ పోయించుకుని అక్కడికి వస్తామన్నారు. ఏ క్షణంలోనైనా అక్కడికి చేరొచ్చు" అని చెప్తుంది. ఆ సందర్భంలో నాకు అని పించేదేమిటంటే, అతను ఇంట్లోనే ఉండి పాపం ఆ స్త్రీతో అలా చెప్పిస్తున్నాడని. ఒక మహారాజులా అతను ఎనిమిదిగంటలకు లేచి ఉంటాడు......ఎంతో సావకాశంగా అతను తయారవుతున్నాడేమో అతన్ని చీల్చి చెండాడాలన్నంత కోపం నాకు వస్తుంది. అతని డీజిల్ కారులో వెళదామనుకునే కదా, నేను నా సొంత పెట్రోలు కారులో వెళ్ళడం లేదు. ఇహ ఇలాంటి బుద్ధి తక్కువ పని చేయకూడదు. ఎవరి మీదైనా ఎక్కువ నమ్మకం పెట్టుకుంటే ఇలాగే జరుగుతుందని నన్ను నేను నిందించుకుంటూ, నేను ఆనాటి వార్తాపత్రికలన్నిటిని చదివేసరికి, ఆ మహానుభావుడు తొమ్మిదిగంటలకల్లా వచ్చేస్తాడు...........ప్రపంచసుందరి పోటీలో పాల్గొనే అమ్మాయిలను చూసి నవ్వుతున్నట్టున్న ఒక దరహాసంతో, పెల్లుబికే కోపాన్ని ఏదో ఒక విధంగా అణిచిపెట్టి ఆలస్యంగా రావడానికి

కారణమడిగితే.....మీరు నన్ను తొమ్మిదిగంటలకి రమ్మని చెప్పారే. అయినా కూడా ఏడున్నరకి నేను బయలుదేరి అక్కడ డీజిల్ పోయిస్తూ ఉంటే, రేడియేటర్ నుంచి ఒక చిన్న లీకయినట్టు గమనించాను. దానికి వెల్డింగ్ చేయడానికి కొంతటైం పట్టింది. ఏం పరవాలేదు. ఇక ఆలస్యం చేయకుంగా బయలుదేరదాం, అ..........ఏమీ జరగనట్టు అంటాడు. ఇలా జరగడం ఇదే మొదటిసారి అయితే అతని మాట నమ్మకుండా ఉండటానికి వీల్లేదు. కానీ ఒక్కొక్కసారి ఒక్కొక్క కొత్త కథ అల్లుతాడు. 'అశుకవి' అన్నట్టుగా అతన్ని 'ఆశుకథకుడు' అనవచ్చు.

భార్య, భర్తకొరకు కానీ, పిల్లల కొరకు కానీ, ఎదురు చూడటం అది ఇంకొక తరహా. ఆయన ఆఫీసు నుంచి రావడానికి అరగంట లేటయితే, ఓ దారిలో ఏ ఆడవాళ్ళతో సరససల్లాపాలాడుతున్నాడేమో అనే అనుమానం కలగవచ్చు....ఒక గంట లేటయితే, అయ్యో..ఎక్కువ ఆలస్యమవుతుంటే తప్పకుండా నాకు ఫోన్ చేసేవారే కదా...ఏదో మీటింగ్‌లో చిక్కుకుపోయి ఉంటారేమో మరో అరగంట గడిస్తే, ఓరి భగవంతుడా, దారిలో ఆక్సిడెంటు ఏమైనా జరిగిందేమో........! ఆ విషయం కనీసం డ్రైవరైనా నాకు ఫోన్ చేసి చెప్పకూడదా ? కానీ , ఆక్సిడెంటులో డ్రైవరే మందుపోయి ఉంటే ?..........అయితే మా ఆయన రక్తపు మడుగులో రోడ్డుమీద స్పృహ తప్పి పడిఉన్నారేమో ? ఎవరైనా ఆయనని హాస్పిటల్‌లో చేర్పించారో ? లేదో ?....దేవతలారా! నాకు ఇక ఎవరు దిక్కు ? నాకు ఏదీ దారి ? ఎవరికని ఫోన్ చేయను? ఎక్కడ వెతకను? ఇంత టెన్షన్ పడేకంటే చచ్చిపోవడమే మేలు ....ఈ ఆలోచలతో ఆమె సతమతమవుతూంటే పాపం ఆ భర్త ఏ ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కుని పళ్ళు పటపటా కొరుకుతూ ఉండి ఉండవచ్చు. హైదరాబాదు ట్రాఫిక్ గురించి మనం తలుచుకోకుండా ఉండటం మంచిది. ఉదయం ఇంట్లోంచి బయలుదేరితే, సమయానికి ఆఫీసు చేరతామా లేదా అనే విషయం కాస్పరోవ్ ఆనంద్ అమృతరాజ్ ...ఓహ్ ! అమృతరాజ్ కాదే!

విశ్వనాథన్ ఆనంద్ వారిద్దరి మధ్యలో జరిగే 'చెస్' లాంటి 'గేమ్' ..లా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు మన బండికి అడ్డువచ్చేది ఊరేగింపు అయితే, మరొక్కప్పుడు సినిమా షూటింగ్ కావచ్చు. మరోసారి రోడ్డు ప్రమాదమైతే, ఇంకోసారి, కొంతమంది ట్రాఫిక్ పోలీసుల కొత్త ప్రయోగాలు కావచ్చు. వీటన్నింటిని మించిన పెద్ద తలనొప్పి, ఎవరో వి.ఐ.పి. ఆ దారిన పోవడం, ఇలాంటి అవకాశం ఒక్కటి దొరికితే చాలు, ట్రాఫిక్ పోలీసులు ఆగర్భ శత్రువులై మనల్ని గంటల తరబడి. రోడ్డు మీద ఇల్లీగల్ కస్టడీలో ఉంచుతారు. ఈ మధ్య, ఒక పెళ్ళి కూతురు ఆమె తల్లి తండ్రులు సమయానికి వివాహమండపానికి చేరుకోలేకపోయారు. కారణం ట్రాఫిక్ జాం. చివరికి పెళ్ళికూతురూ, ఆమె తల్లి తండ్రులు ఒకటిన్నర కిలోమీటరు దూరం చెమటలు పట్టేలా పరిగెత్తి మంటపం చేరేసరికి మరో దారిని, ముందుగానే అక్కడికి చేరిన పెళ్ళికొడుకు, అతని తల్లిదండ్రులు పెళ్ళికూతురు పక్షం వాళ్ళు రాలేదని ఆందోళనతో చెమటలు పట్టి ఉన్నారు.

ఇహ, మనం, భర్తకోసం ఎదురు తెన్నులు చూస్తున్న ఆ భార్యామణి ఇంతకీ ఎలా ఉందో చూద్దాం. భర్త ఇంటికి చేరడంలో ఆలస్యం కన్నా, పిల్లలు రావడంలో ఆలస్యం, ఆమెను ఎక్కువ బాధకి గురి చేస్తుంది. కూతురు స్కూలుకి స్కూలు బస్సులో వెళ్ళడం రావడం వల్ల భయపడవలసిన అవసరం లేదు. ఎప్పుడైనా ఆ బస్సు లేటు కావచ్చు. లేకపోతే మొదటి ట్రిప్పులో రాకుండా, ఆ అమ్మాయి రెండో ట్రిప్పులో రావచ్చు. పాప రావడం, అరగంట ఆలస్యమైతే, ఆ తల్లికి కలిగే భయం ఏమిటంటే, ఆ అమ్మాయిని ఎవరో కిడ్నాప్ చేశారేమో! అని అమ్మాయిలని తీసుకు వెళ్ళి బొంబాయి, మద్రాసులో అమ్మేస్తున్నారని వార్తలు దిన పత్రికలలో వస్తున్నాయి కదా! కూతురు రావడంలో ఇంకా కొంచెం ఆలస్యం జరిగితే, తిమ్మిర్లు కమ్మేసి ఆమె మంచుగడ్డలా అయిపోతుంది.

అదే అబ్బాయి విషయంలోనైతే? కాలేజీలో చదువుతున్న ఆ అబ్బాయికి

ఒక మోటారుసైకిలు ఉంది. అతను ఇంటికి తిరిగిరావడంలో కొంచెం ఆలస్యం జరిగితే మహాభారత యుద్ధాన్ని సంజయుడు మనో నేత్రంతో చూసినట్టుగా, ఆ తల్లికి అబ్బాయి రోడ్డు ప్రమాద దృశ్యం ఒక బహువర్ణ చిత్రంగా కనబడుతుంది. పొద్దున్న దినప్రతిక తెరిచి చూస్తే చాలు రోజుకి కనీసం అయిదారు రోడ్డు ప్రమాదాలు, చావులు కనిపిస్తాయి కదా?

ఈ విధంగా ఎలాంటి ఎదురుచూపులైనా అది మనిషిని బేజారు చేస్తాయన్న మాట మాత్రం నిజమే. కానీ హాయి గొల్పే ఎదురు చూపులు కూడా లేక పోలేదు. రాబోయే మంచి రోజు గురించి ఆలోచన , శోభాయామానమైన భవిష్యత్తు గురించి శుభాప్తివిశ్వాసం, ఇలాంటివి హాయిగొలిపే ఎదురు చూపులకు, పగటి కలలకు దారితీస్తాయి.

ఇందులేఖ ఎదురుచూపు ఒక శుభవార్త అందుకోవడానికైనా కూడా, సాయంత్రం నాలుగు దాటాకా, ఆమె గుండె దడ పెరుగుతూ వచ్చింది. వినబోయే శుభవార్త తనకు పులకరింపు కలుగ చేస్తుందని ఆమెకు నమ్మకం ఉన్నా ఎందుకో గానీ, అమె లోపల ఒక అకారణ భయం నల్లటి ధూమపటలంలా వ్యాపిస్తున్నట్టు ఆమెకి అనిపించింది. సాయంత్రం ఆరు కొట్టేసరికి, ఆమె ఓర్మి నశించిందని చెప్పడం కంటే ఆమె నప్త నాడులు బిగిసి పోయాయని చెప్పడమే వాస్తవంగా ఉంటుంది. ఒక జీవచ్ఛవంలా, టెలిఫోన్‌కు బానిసై ఆమె ఇస్సహాయంగా వేచి ఉండి పోయింది.

ఆరు దాటి పదమూడు నిమిషాలు అయ్యేటపుడు, టెలిఫోన్ మోగడం విని ఆమె ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఒక్క క్షణం ఆగకుండా ఆమె రిసీవర్ చేతిలోకి తీసుకుంది.

"హలో...." "హలో....."

"సారీ ఇందూ, ఫోన్ చేయడానికి కాస్త ఆలస్యం అయింది."

"ఫరవాలేదు మధ్యాహ్నం నుంచి మీ కాల్ కోసం టెలిఫోన్‌కి అంటుకుని ఉన్నాను."

"డాడీతో కొంచెం ఎక్కువసేపు మాట్లాడటం వల్ల ఈ ఆలస్యం జరిగింది."

"మన విషయం గురించే ?"

"అవును. అదే కదా మన ప్రస్తుత జీవన్మరణ సమస్య ?"

"జీవన్మరణ సమస్యా ? ఎందుకలా అంటున్నారు ?"

" ఇందూ ! చెప్పబోయే విషయం విని నువ్వు దిగులు పడవద్దు. మా నాన్న గారు మన వివాహానికి ఒప్పుకోవడం లేదు."

ఇందులేఖ తలమీద ఒక పిడుగు పడ్డట్టయింది. ప్రపంచమంతా తనచుట్టూ తిరిగిపోతున్నట్టు ఆమెకి అనిపించింది. మలేరియా జ్వరం వచ్చినట్టు, ఆమె శరీరం కంపించసాగింది. తను కింద పడిపోతానేమో అని ఆమె భయపడింది. ఫోన్లో "ఇందూ! ఇందూ!" అని పిలుపు వినబడి, ఆమె ఒక భయంకర స్వప్నం నుంచి బయటపడినట్టుగా రిసీవర్ తిరిగి చేతిలోకి తీసుకొని,

"మురళీ, నాకు తల తిరుగుతోంది. డాడీతో మరి మీరేం చెప్పారు?"

" చాలాసేపు మాట్లాడి చూశాను. ఆయన ఏరకమైన మనిషో తెలుసు

కదా. ఆయన ఒక నిర్ణయానికి వచ్చారంటే ఇక దానికి అప్పీల్ లేదు."

" అయితే మీ నిర్ణయం ఏమిటి ....?"

" డాడీ ధిక్కరించడానికి నాకు ధైర్యం లేదు. మనం కొంతకాలం వేచి చూద్దాం. పరిస్థితులు కొంత మెరుగుపడితే డాడీ మనస్సు కూడా మారుతుందేమో. "

" అపుడు నా కడుపులో పెరుగుతున్న మన బిడ్డ విషయం...! "

" దానిని తీసివేయడం తప్పదు. "

" ఓ మైగాడ్! మీకేమయింది ? మన మొదటి బిడ్డ పుట్టకముందే చంపాలనా మీ ఉద్దేశం. "

" ఒక బిడ్డ కావాలని మనమెపుడు అనుకోలేదే ? పొరపాటు వల్ల అలా జరిగింది. అబార్షన్ చేయించుకోవడమే దానికి పరిహారం. అది నేను చాలా రహస్యంగా చేయిస్తాను".

" మురళీ ! మురళీ ! ఇంత క్రూరంగా మాట్లాడవద్దు. ఏమైనా సరే, మన పావన ప్రేమకు ప్రతీకగా ఉన్న ఆ బిడ్డని చంపొద్దు."

" ఇందూ డోంట్ బి సిల్లీ. ఇహ గత్యంతరం లేదే ? మన పెళ్ళి అంత త్వరలో జరగడానికి వీలు కాదు. అలాంటప్పుడు, ప్రసవించిన తరువాత పెళ్ళి చేసుకోవాలా? మీ కుటుంబానికి ఇంతవరకూ జరిగిన అవమానం సరిపోలేదా? ఇరుగు పొరుగు వారికి ఇంకా ఎక్కువ వినోదం కలిగించాలా ?"

" లేదు, మురళీ లేదు. ఇతరులకు నేను వినోదం కలిగించను. ఈ బిడ్డ విషయం మీరు డాడీతో చెప్పారా? "

" చెప్పాను పెళ్ళికి ముందు ఒక అమ్మాయి గర్భవతి అయితే, దానికి బాధ్యుడని ఒప్పుకునే వాడు వట్టి మూర్ఖుడవుతాడని మా డాడీ అభిప్రాయం."

" మురళీ, మురళీ, అంత నిర్దయగా మాట్టాడకు. మీరు దానికి జవాబు ఏమీ ఇవ్వలేదా. "

" ఆయన చెప్పిన మాట నిజమేనని నీకు కూడా అనిపిస్తుంది. పెళ్ళికి ముందు తల్లి కావడం మన సమాజం ఒప్పుకుంటుందా ?"

" నేను తప్పు చేశాననా మీ భావం. ఈ తప్పులో మీరు కూడా భాగస్వామి కాదా?"

"తప్పులో భాగం నాది అని ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదని మా డాడీ చెప్తున్నారు."

" అంటే....? "

" ఈ కాలపు అబ్బాయిలు ఎంతో మంది అమ్మాయిలకు దగ్గరగా మసలుతారు. అమ్మాయిలకు కూడా కొంతమంది బాయ్‌ఫ్రెండ్స్ ఉండటం సామాన్యమే."

"నాకు బాయ్‌ఫ్రెండ్స్ ఎవరూ లేరని మీకు తెలియదా ? "

" లేరనే నువ్వు నాకు చెప్పావు. కానీ నువ్వు చెప్పిన మాట నిజం కావాలని లేదే? స్త్రీనాంచ చిత్తం, పురుషస్య భాగ్యం అనే పెద్దవాళ్ళు చెప్పారు."

" అంటే మీకు నామీద నమ్మకం లేదన్న మాట. అయితే మీరు ఇంతవరకూ నా మీద చూపించిన దివ్య ప్రేమంతా..... ఈ ఉదయం కూడా......."

" అవన్నీ మన ఇద్దరి శారీరక అవసరాలే కదా! వయస్సులో ఉన్న యువతీ యువకులు ఛాన్స్ దొరికితే ఏదైనా చేస్తారు. కానీ పెళ్ళికి ముందు గర్భం రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అమ్మాయిలదే."

" మీరిక ఏం మాట్లాడవద్దు. నా తప్పు నేను ఒప్పుకుంటాను. కానీ, ఇంతవరకూ మీరు నామీద చూపించిన ప్రేమంతా వట్టి నాటకమేనా ?

" కాదు, ఇందులేఖా ! కాదు. అది సరియైన ప్రేమే. కానీ మనమంతా పరిస్థితులకు బానిసలమే కదా. కాలానుగుణంగా వర్తించడమే బుద్ధిమంతుల లక్షణం. నిన్ను మోసం చెయ్యాలనే ఉద్దేశం నాకు ఎప్పుడూ ఉండేది కాదు. ఈ నాటికీ లేదు. కానీ మామూలుగా అందరూ చెప్పేటట్టు నా ప్రేమ గుడ్డిది కాదు. సమయానుసారంగా మారకుండా ఉండటం నా వల్ల కాదు. "

"అయితే మీరు ఈ ఉదయం చూపించినదంతా నాటకమే కదా ! ఎందుకంటే, కాలానుసారంగా మారడమనే నిర్ణయం దానికి ముందే తీసుకుని ఉంటారు."

" నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. నువ్వు చాలా బుద్ధిమంతురాలివు. విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకునే ఇంగిత జ్ఞానం నీకు ఉంది. మన ప్రేమని, నీ అందాన్ని ఆదరించడమే ఈ రోజు ఉదయం జరిగింది. ఇక ముందు కూడా

ఇలాంటి అవకాశం దొరికినపుడల్లా నేనిలాగే చేస్తాను. నువ్వు ఎవరి భార్యవైనా సరే నేను మాత్రం నీతో ఇలాగే ఉంటాను. కానీ ప్రస్తుతం నా సలహా నువ్వు పాటించక తప్పదు. జీవితాన్ని వీలున్నంతవరకూ ఆస్వాదించడమే తెలివి అని పించుకుంటుంది. లెటజ్ ఎంజాయ్ ఇట్."

" షటప్ ! యూ బ్లడీ స్కౌండ్రల్ ! ఇంత వరకూ నువ్వు నన్ను మోసం చేశావు. ఇక నేనేమి చెయ్యాలో నువ్వు నాకు నేర్పొద్దు. భవిష్యత్తులో నేర్చుకోవడమనేది నీ వంతు. లవ్ మేబీ బ్లైండ్, కానీ ఆ దేవుడు గుడ్డివాడు కాదు. నీకు తగిన శాస్తి జరుగుతుంది. "

ఇందులేఖ రౌద్రావేశంతో కంపించిపోతోంది. టెలిఫోన్ రిసీవర్‌ని ధణేల్‌మని పెట్టేసింది. సర్వదాహకమైన కోపాగ్నిలో ఆమె కన్నీరు ఆవిరై పోయింది. దెయ్యం పట్టిన దానిలాగా టేబిల్ దగ్గరకు పరుగెత్తుకుని వెళ్ళి ఒక కాగితం తీసుకుని ఉత్తరం వ్రాయడం మొదలు పెట్టింది.

"డియర్ మమ్మీ !

మమ్మీ, డాడీ ఇష్టప్రకారంగా, నా ఎంగేజ్‌మెంట్ జరిగింది. మురళిని నేను ఎంతో ప్రేమించాను. ఎంతో నమ్మాను. కానీ అతను అతని తండ్రి, ఇన్నాళ్ళూ ఒక నాటకమాడుతూ వచ్చారు. ఇక ముందు, నేను ఏ మగవాడిని నమ్మలేని పరిస్థితిలో ఉన్నాను. ఇవాళ నేను ఎవరికి ముఖం చూపించలేకుండా ఉన్నానంటే దానికి బాధ్యత కేవలం నాదే. నరుల రూపంలో రాక్షసులుంటారని నేను ఇంత వరకూ కనుక్కోలేక పోయాను. నేను ఇంకా బతికుంటే మీకు, నాకు, అందరికీ సమస్యలే కలుగుతాయి. అందుకే నన్ను....క్షమించు...గుడ్ బై. నాకు మరో జన్మంటూ ఉంటే నీకు కూతురుగా పుట్టడం ఇష్టంలేదు.... మమ్మీ.....నన్ను మీ కొడుకుగా పుట్టనివ్వండి....మరోసారి ఇలాంటి వంచనకు

బలి అవడం నావల్ల కాదు........పై లోకానికి చేరిన తరువాత, ఎల్లప్పుడూ మీ అందరి క్షేమం కోసం ప్రార్థిస్తూ ఉంటాను. నా అవివేకాన్ని మన్నించు....

ఆమె ఆ లేఖను పూర్తిచేయలేకపోయింది. శరీరమంతా కంపించడం వల్ల అక్షరాలు కొంచెం అడ్డదిడ్డంగా వచ్చాయి. శరీర మంతా దహించి నట్టు అనిపించడంతో ఒక గ్లాసుడు చల్లటి నీ ళ్ళు ఒక్క గుక్కలో తాగేసింది. కానీ ఆ వేడి తగ్గలేదు. ఆమె తీసుకున్న నిర్ణయం బలపడుతూ వచ్చింది. గదిలో ఉన్న టేబిల్‌ని సీలింగ్ ఫాన్ కిందకి లాక్కొచ్చింది. ముందు బీరువాలోంచి ఒక చీర తీసింది. వద్దనుకుని లోపల పడేసింది. తరువాత ఒక దళసరి నూలుతాడు బయటకు తీసింది. ఒక కొస ఫాన్‌కి ముడేసింది. మరో కొస జారు ముడి వేసి మెడకు బిగించింది. ఒక సర్కస్ పిల్లలా బల్ల అంచుమీద పాదాలు పెట్టి బలంకొద్దీ ఆ బల్లను అవతలకి తోసేసింది. ఆమె కోమల శరీరం దాని పూర్తి బరువుతో వాత్సల్యంతో ఆహ్వానిస్తున్న గురుత్వాకర్షణకు లోనైంది. కొన్ని క్షణాల పాటు అనియంత్రిత చలనాలు....తీవ్రమైన శ్వాస స్తంభన క్లేశం....కళ్ళ ముందు విస్ఫోటమయ్యే నక్షత్రాలు...అగ్నిస్ఫులింగాలు.....తరువాత అంధకారం...ఘోరాంధకారం......ఆ యువతి సుకుమార శరీరం నిశ్చలమయింది. జీవితం యొక్క కంటకపంపీడకమైన కష్టాలనుంచి ఆ ఇందులేఖ అనే ఆ తరుణికి శాశ్వత విముక్తి లభించింది. మురళి అమానుషత్వాన్ని నమ్మలేక పోయినట్టు ఆమె కళ్ళు బయటికి పొడుచుకు వచ్చాయి. మురళి క్రూరత్వాన్ని ఇముడ్చుకోలేక వమనం చేసుకున్నట్టు ఆమె జిహ్వాగ్రం కూడా కొంచెం బయటికి వచ్చింది. మురళిని మట్టిలో కప్పెట్టాలని నిర్దేశిస్తున్నట్టు కాలి వేళ్ళు, చేతి వేళ్ళు అధో దిశను చూపిస్తున్నాయి.

ఇందులేఖ ప్రణయగాధ ఆమె ప్రాణత్యాగంతో ముగిసిందా ? లేక ఆమె గాయపడిన ఆత్మ అతని లజ్జావిహీనమైన శేష జీవిత అధ్యాయాన్ని వెన్ను కరడుగట్టే భీకర చలన చిత్ర దృశ్యాల్లాంటి అనుభవాలతో నింపుతుందా ?

బతికో, చచ్చో, ఎల్లాగైనా సరే ఆ నీచుడి మీద కక్ష సాధించ కుండా ఆమె ఉండలేదు. తన శరీరాన్ని కేవలం కామనివృత్తి కోసం ఉపయోగించుకున్న ఆ అధిభాషక తనయుణ్ణి, ఆ మంత్రి కుమారి సులువుగా వదిలి పెట్టగలదా? లేదు......లేదు...........నిశి వేళ్ళల్లో అతనిని ఆమె ఒక కొరివి దెయ్యమై వెంటాడుతుందేమో. పగటి వేళల్లో అతని హృదయాన్ని వెయ్యి సూదిపోట్లతో పొడుస్తుందేమో. అయ్యో అన్నట్టు. ఇందులేఖకి ఇప్పటికీ అర్థం కాలేదా? అతనికి హృదయం అనేదే లేదని !!!